

తనకు అడ్డు వస్తున్నాడని..

బావను హత్య చేసిన బావమరిది



ఇలియాస్ మృతదేహం



నిందితుడు అబ్దుల్ సత్తార్..

బంజారాహిల్స్: తనకు అడ్డు వస్తున్నాడనే కోపంతో ఓ వ్యక్తి సొంత బావనే దారికాచి కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఫస్ట్‌లాన్సర్‌కు చెందిన మహ్మద్ ఇలియాస్ (47) సెంట్రింగ్ పని చేసేవాడు. అతడి బావమరిది అబ్దుల్ సత్తార్ మాసబ్‌ట్యాంక్ సమీపంలో ఓ చికెన్ షాపులో తండ్రి షేక్ అబ్దుల్ వాహెబ్, సోదరుడు గౌస్‌తో కలిసి పని చేసేవాడు. మద్యానికి బానిసైన సత్తార్ కొంతకాలంగా డబ్బుల కోసం తండ్రి, సోదరుడితో తరచూ గొడవపడటమేగాక డబ్బులు లాక్కెళ్లేవాడు. ఈ నేపథ్యంలో తండ్రిని, సోదరుడిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నావని, మద్యం తాగడం మానేయాలని అతడి బావ మహ్మద్ ఇలియాస్ పలుమార్లు సత్తార్‌కు హితవు పలికాడు. డబ్బులు ఇవ్వకుండా తండ్రిని నియంత్రించాడు. ఈ విషయమై ఆదివారం రాత్రి ఇలియాస్, సత్తార్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. డబ్బుల కోసం తండ్రిని వేధించవద్దని, మరోమారు ఇబ్బందులకు గురిచేస్తే బాగుండదని బావమరిదిని హెచ్చరించిన ఇలియాస్ ఫస్ట్‌లాన్సర్‌లోని తన ఇంటికి వచ్చాడు. దీంతో ఆగ్రహానికి లోనైన సత్తార్ పథకం ప్రకారం చికెన్ షాపులోని కత్తిని జేబులో పెట్టుకుని బావను వెంబడించాడు. ఇంట్లోకి వెళ్తున్న ఇలియాస్‌ను బయటికి లాగి పొత్తి కడుపులో విచక్షణా రహితంగా పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఇలియాస్‌ను కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఇంతియాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు సత్తార్‌పై కేసు నమోదు చేశారు. నాలుగు గంటల్లోనే పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌బీఐ అగ్ని ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై బ్యాంకు అధికారులు మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు కార్యాలయంలోని నాలుగో అంతస్తులో ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో కొన్ని డాక్యుమెంట్లతో పాటు ఫర్నిచర్ కూడా కాలిపోయిన సంగతి తెలిసిందే. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చునని ఎస్‌బీఐ హోం లోన్ సెంటర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మురళీ కృష్ణ సోమవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుంచి పలువురు బ్యాంకు అధికారులు అగ్ని ప్రమాద నష్టంపై ఆరాతీశారు. ఉన్నతాధికారులు సైతం సంఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. జంటనగరాల్లోని హోంలోన్స్‌కు సంబంధించిన అన్ని రికార్డులు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా ఇక్కడే ఉండటంతో రుణాలు తీసుకున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎంత మేరకు ఆస్తినష్టం జరిగింది, ఏఏ రికార్డులు కాలిపోయాయి అనేది మాత్రం బ్యాంకు అధికారులు వెల్లడించడం లేదు.





అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



శ్రీనివాస్ (ఫైల్)

సుభాష్‌నగర్: అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక శివాలయ నగర్‌లో శ్రీనివాస్ (45), లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్ జీడిమెట్లలోని ఓ కెమికల్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అతడి భార్య లక్ష్మి నాలుగేళ్ల క్రితం చీటీల వ్యాపారం నిర్వహించింది. కరోనా సమయంలో ఆమె వద్ద చీటీలు పాడినవారు డబ్బులు కట్టకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో మిగతా వారు ఒత్తిడి చేయడంతో వాటిని తీర్చేందుకు అప్పు చేసింది. ఈ క్రమంలో తమ ఇంటి సమీపంలో ఉంటున్న ఆసియా బేగం వద్ద రూ.9 లక్షలు అప్పుగా తీసుకుంది. ఇందుకుగాను వడ్డీ రూపంలో రూ.5 లక్షలు చెల్లించారు. మిగతా డబ్బులు చెల్లించాలని గత వారం రోజులుగా ఆసియా బేగం ఆమె కుటుంబ సభ్యులు ఇంటి వద్దకు గొడవ చేస్తున్నారు. సోమవారం ఉదయం కూడా వారు గొడవ చేయడంతో మనస్తాపానికి లోనైన శ్రీనివాస్ పెట్రోల్ బాటిల్‌ను తీసుకుని ఆసియా బేగం ఇంటి ముందుకు వెళ్లి నిప్పంటించుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు మంటలు ఆర్పి అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. సూరారం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

నిజాంపేట్: దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగా ఈ నెల 20న అన్ని కార్మికుల సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సోమవారం ఏఐటీయూసీ మున్సిపల్ రంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 100 ఏళ్లలో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందన్నారు. కార్మిక, కర్షక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్, ఏఐటీయూసీ మున్సిపల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరినాథ్‌రావు, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

యువకుడి దుర్మరణం



గోపీ కృష్ణా రెడ్డి (ఫైల్)

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా, కోదాడకు చెందిన తుమాటి గోపీ కృష్ణా రెడ్డి (27 అనే యువకుడు హాస్టల్ నిర్వహిస్తూ అన్నోజి గూడ ప్రేమలత అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అతడికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆదివారం సాయంత్రం స్నేహితుడిని కలిసేందుకు చైతన్యపురి వెళ్లిన అతను సోమవారం తెల్లవారుజామున ఇంటికి బయలుదేరాడు. నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఉప్పల్ నుంచి నాగోల్ వైపు వేగంగా వచ్చిన లారీ అతడిని ఢీకొట్టింది. లారీ చక్రాల కింద పడిన అతడిని దాదాపుగా 10 మీటర్లు లాక్కెళ్లింది. ఈ ఘటనలో అతని శరీరం నుజ్జు నుజ్జుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మూటగట్టి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీకోసం గాలిస్తున్నారు.























వరద సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

కుత్బుల్లాపూర్: వర్షాకాలంలో వరదనీరు చేరకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం గాజులరామారం డివిజన్ ఓక్షిత హిల్‌వ్యూ కాలనీలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, వరదనీటి సమస్యను పరిశీలించిన ఆయన యుద్ధ ప్రాతిపదికను పనులు చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రతి వర్షాకాలంలో ఓక్షిత హిల్ వ్యూ కాలనీని వరదనీరు ముంచెత్తడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, భూగర్భ డ్రైనేజీ, డ్రెయిన్ లైన్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ఎస్ఈ చెన్నారెడ్డి, ఈఈ కిష్టప్ప, వాటర్ వర్క్స్ అధికారులు, నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఓక్షిత హిల్ వ్యూ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణ, సురేందర్ ఉన్నారు.


ఓక్షిత వ్యూ హిల్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

అధికారులతో సమీక్ష..

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయంలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యను పరిష్కరించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్‌బషీరాబాద్‌లో క్యాంప్ కార్యాలయంలో ఆయన హౌసింగ్ బోర్డు, విద్యుత్, జల మండలి, ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూమ్ పొందిన లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా మంచినీటి సరఫరా, పారిశుద్ధ నిర్వహణ, విద్యుత్ సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, రవాణా సౌకర్యం, ప్రార్థనా మందిరాల నిర్మాణానికి స్థలాల కేటాయింపు పూర్తి చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని రోజుకు రెండుసార్లు నీటిని సరఫరా చేయాలని, వీధి దీపాల ఏర్పాటుతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ వేయాలని ఆదేశించారు.



పార్కు అభివృద్ధికి వినతి

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో పార్కు అభివృద్ధి విషయంపై సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, సంక్షేమ సంఘం ప్రతినిధులు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు 2013 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కు ఖాళీగా ఉండడంతో ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులకు ప్రహరీ నిర్మాణం కోసం విన్నవించగా వారు సానుకూలంగా స్పందించారు. బోర్‌వెల్‌తో పాటు మొక్కల పెంపకం, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని కోరగా జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



శివరాత్రి యాదగిరికి గద్దర్ ఐకాన్ అవార్డ్

కుత్బుల్లాపూర్: సమాజ సేవకుడు, గాయకుడిగా సేవలందించిన కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన శివరాత్రి యాదగిరి గద్దర్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. సాయి అలేఖ్య సంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భాస్కర ఆడిటోరియంలో వేణుగోపాలచారి అధ్యక్షతన జరిగిన గద్దర్ ఐకాన్ అవార్డు–2024 కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా శివరాత్రి యాదగిరి అవార్డును అందుకున్నారు. శివరాత్రి యాదగిరి 1992 నుంచి ఆల్ ఇండియా రేడియోలో వందలాది జానపద గేయాలు పాడి పలు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల గద్దర్, ప్రజా గాయని విమలక్క హాజరయ్యారు.


అవార్డు అందుకుంటున్న శివరాత్రి యాదగిరి



ఆర్థిక సాయం అందజేత

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామానికి చెందిన వేగేశన ప్రేమావతి(59)కి మెదడులో రక్తం గడ్డ కట్టడంతో నగరంలో ప్రైవేట్ ఆసుపత్రిలో సర్జరీ చేయించారు. పేద కుటుంబం ఇల్లు గడవడం కష్టం కావడంతో స్థానికులు క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకుని బాధితురాలి నివాసానికి వెళ్లి రూ. 15వేల చెక్కు అందజేసి భరోసా ఇచ్చారు. అంతేకాక సీఎం రిలీఫ్ ఫండ్ కూడా ఇప్పిస్తానని బాధిత కుటుంబానికి క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పాత్తూరి శివాజీ రాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాను కుమార్, సభ్యులు సంతోష్ రాజు, వెంకటపతి రాజు,సత్యనారాయణ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు



సమస్యలపై ఎంపీ ఈటలకు వినతి


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలపై బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి నేతృత్వంలో సోమవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. వినతి ఇచ్చిన వారిలో ప్రభాకర్‌రెడ్డి, కొమ్ము ప్రశాంత్, మహిళా నాయకురాలు రోజా ఉన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. టౌన్ ప్లానింగ్‌పై 1, ఇంజినీరింగ్–2 విద్యుత్‌పై 1 ఫిర్యాదు వచ్చాయన్నారు.

- గాజులరామారం సర్కిల్ పరిధిలో మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆరు ఫిర్యాదులు రాగా ఇంజనీరింగ్ 5, విద్యుత్‌పై 1 వచ్చాయన్నారు.

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎనిమిది ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. నీటి బిల్లు, భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్, వివిధ సమస్యలపై ఫిర్యాదు వచ్చాయన్నారు.



